# కథానిక ప్రతిధ్వని

చిలుకాకుపచ్చ పట్టుచీర కట్టుకుంది, ప్రభావతి.

ఏవేవో పనులు ఇంట్లో వున్నవారికి పురమాయిస్తూ, హడవిడిగా తిరుగుతోంది. ఆ హడావిడిలోనూ, ఆమెలో హుందాతనం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"పెళ్ళివార్నొచ్చే వేళ కావస్తోంది. ఏర్పాట్లన్నీ తొందరగా పూర్తి చెయ్యండర్రా..." వంటగదిలో వున్నవారికి మర్రో మారు హెచ్చరించింది, ప్రభావతి.

సోఫాలో కూచుని వున్న కనకరాజుకి, తల్లి ఆరాటానికి అర్ధం కనిపించలేదు.

"నిశ్చయమైపోయిన సంబంధమే కదమ్మా ఎందుకా కంగారు?" అన్నాడు, కనకరాజు.

ప్రభావతి, సన్నగా మందహాసం చేసింది.

"ఆరాటం కాదురా అబ్బాయ్. అది నా బాధ్యత. వాళ్ళొచ్చేసరికి ఏర్పాట్లన్నీ పూర్తయితే, మన గొప్పతనం గురించి వాళ్ళే గుసగుసలాడుకుంటారు. ఏ విషయం లోనూ, వాళ్ళు మనల్ని నిందించకూడదు. మనచేయి ఎల్లప్పుడూ పైనే వుండాలి. అర్ధమయ్యిందా?" అంది హుందాగా.

"మరేం ఫరవాలేదమ్మా. వాళ్ళు ఏ విషయంలోనూ మనల్ని నిందించే అవకాశం వుండదు. నువ్వు నిశ్చింతగా వుండు." హామీ ఇచ్చాడు కనకరాజు.

"అదేరా నేను కోరుకునేదీను!" తృప్తిగా నవ్వుకుంది ప్రభావతి.

ఆమె మొహంలో సంతోషపు చాయలు తారాడుతున్నాయి.

"ఒరేయ్ రాజూ, చెల్లాయి ఎంతో అదృష్టవంతురాలురా. అది,. దాని పూర్వజన్మ సుకృతమే అనుకో. ఎంత మంచి సంబంధం కుదిరిందని! అలా చూస్తూ వుండు రాజాలాంటి సంబంధం

నీకూ చేస్తాను. ఈ ప్రభావతి అంటే ఏవిటో అందరికీ తెలియజేస్తాను. "సగర్వంగా అంది ప్రభావతి.

కనకరాజు మాట్లాడలేదు. తన పెళ్ళి సంబంధం విషయంలో కొద్దిరోజులక్రితం తల్లి ప్రవర్తించిన తీరు కాస్తంత మనస్తాపం కలిగించినా, అప్పట్లో అతను మాట్లాడలేకపోయాడు. అదే అతని బలహీనత.

ఇంటిముందు, ఆటో ఆగిన చప్పుడు వినిపించింది.

"అదిగో, వాళ్ళొచ్చేసేరు." అంటూనే అతృతగా వీధిలోకి నడిచింది ప్రభావతి. కనకరాజు లేచి, తల్లిని అనుసరించాడు.

ఆగిన ఒక్క ఆటోలోంచి కాబోయే వరుడు ధనరాజు, అతని తల్లి వేదవతి, చెల్లెలు మాలతి దిగారు. వేదవతి చిన్నల్లుడు రవి, స్కూటర్ మీద వచ్చాడు.

"రండి, రండి... మీకోసమే ఎదురుచూస్తున్నాం..." లాంఛనప్రాయంగా ఆహ్వానించింది ప్రభావతి. వచ్చిన వారిని చూసి, ఒకింత ఆశ్చర్యపోయింది.

"ఔనూ, మీర్రు సుమారు పదిహేనుమంది వస్తామని చెప్పారుకదా, నలుగురే వచ్చారేంటి వదినగారూ?" కాబోయే వియ్యపురాలు వేదవతిని వుద్దేశించి అంది ప్రభావతి.

"లోపలకి పదండి, మాట్లాడుకుందాం." వేదవతికి బదులు, ఆమె చిన్నల్లుడు రవి సమాధానం చెప్పాడు.

అందరూ హాల్లోకి వచ్చి కూచున్నారు. "మీరు పదిహేను మంది వస్తారని, ఆ మేరకే భోజనాలు ఏర్పాటు చేశాను" అంది ప్రభావతి.

"అయినా ఈ భోజనాలూ అవీ ఎందుకండీ?" అన్నాడు ధనరాజు.

ప్రభావతి మొహంలో రంగుమారింది.

"అదేంటల్లుడూ అలా అంటావు? మొన్నను మీ ఇంటి దగ్గర పెళ్ళి విషయాలన్నీ నిర్ణయించుకున్నాక, నా సంతృప్తి కోసం ఏర్పాటు చేశాను బాబూ" అంది ప్రభావతి

రవి భార్య మాలతి అందుకుంది-

"అది కాదండీ! సంబంధం ఇంకా ఫైనల్‌గా నిశ్చయమవ్వకుండానే ఆ విందులూ అవీ ఎందుకు చెప్పండి!" అంది మాలతి.

ప్రభావతి నివ్వెరబోయింది. తాను నిల్చున్న చోట భూమి కదులుతున్నట్టు అనిపించిందామెకి.

అంతా నిశ్చయమైపోతే ఇంకా అవ్వలేదని అంటుందేమిటి?.... అనుకుంది లోలోన.

"అదేమిటమ్మా? సంబంధం నిశ్చయం కాకపోవడమేమిటి? అన్నీ నిశ్చయించుకున్నాం కదా? ఒక్క పెళ్ళి జరిపించే తేదీయే నిశ్చయించాల్సి వుంది. ఇప్పుడిలా అంటున్నావేవిటి?" పేలవంగా అంది ప్రభావతి.

"అవన్నీ హడావిడిగా జరిగిపోయాయే గాని, నిదానంగా దేన్నీ మేం నిర్ణయించలేదండీ. మా అమ్మకి, మా అన్నయ్యకి, మీరు ఇస్తామన్న లాంఛనాలు సంతృప్తికరంగా లేవండి! మొన్నను మొహమాటపడిపోయింది. ఆ విషయం చెప్పలేకపోయాం. లాంఛనాలకి గాను మరో ముప్పయి వేలు అదనంగా ఇస్తేనేగాని, మీ సంబంధం ఖాయం చేసుకోమని, వాళ్ళిద్దరూ ఇక్కడే వున్నా, నన్ను చెప్పమన్నారు." నిర్మొహమాటంగా చెప్పింది మాలతి.

ప్రభావతి, షాక్ తింది. ఆమె మొహం వాడిపోయింది.

"ఏవిటి? మరో ముప్పయివేలా? అడగడానికయినా, ఓ హద్దుండాలి మాలతీ. అంతా నిశ్చయమై, సంప్రదాయబద్ధంగా నిశ్చయతాంబూళాలు మార్చుకున్న తర్వాత మీరిలా, అదనంగా డబ్బు కోరడం భావ్యంగా లేదమ్మా.. అదనంగా అంత మొత్తం ఇచ్చుకోలేం." నిరసనగా చెప్పింది ప్రభావతి.

'అయితే ఈ వివాహం జరగదండీ, పదమ్మా పోదాం ." ఖచ్చితంగా చెబుతూ తల్లికేసి చూసింది మాలతి.

ప్రభావతి కంగారుపడింది. వీళ్ళేవిటి ఇంత అమర్యాదగా ప్రవర్తిస్తున్నారు ? అనుకుంది అంతరంగంలో.

"చూడమ్మా మాలతీ ! ఆడపిల్లవారమని, మీరిలా హిరణ్యాక్ష వరాలు కోరితే భావ్యమా ? మాకూ తాహతువుండాలి కదమ్మా " అంది ప్రభావతి.

" అది మాకు అనవసరమండీ ! ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకోవడం సహజమే కదా. మా అన్నయ్యకి ఎన్నో సంబంధాలొస్తున్నాయి. మీకంటే అధికంగా లాంఛనాలు ఇస్తామన్నవారు మా లిస్టులో వున్నారు అవి వదులుకోలేం కదండీ ! డబ్బు ఎవరికి చేదు చెప్పండి ... " గుక్క తిప్పకోకండా చెప్పింది మాలతి.

ప్రభావతి, అప్రతిభురాలయింది.

" వదినగారు, మీరు ఉండికూడా ఇలాంటి అన్యాయం జరుగుతూ ఉంటే చూస్తూ ఊరుకోవడం

బావులేదు. మీ సంబంధం నిశ్చయమైందని, మా కాలనీవాళ్ళకు, బంధువు వర్గానికి చెప్పేశాం. ఇప్పుడు తప్పిపోతే, మాకు ఎంతటి అప్రతిష్ట ? మా అమ్మాయికి మళ్ళీ సంబంధాలు వస్తాయా చెప్పండి.'' సుమారు కన్నీళ్ళు తెచ్చుకుంటూ మౌనంగా వున్న వేదవతిని ఉద్దేశించి అంది ప్రభావతి.

అంతా వింటున్న కనకరాజుకు ఏం చేయాలో అర్థం కాలేదు. అదనంగా ఆ ముప్పై వేలు ఇచ్చేస్తామని తానుగా చెప్పలేదు. అటువంటి స్వతంత్రత అతనికి లేదు. నిస్సాహాయుడై గమ్మున ఊరుకున్నాడు.

వేదవతికి తోచలేదు, ఏం చెప్పాలో. కొడుకు ధనరాజుకేసి చూసింది. తను ఇంకా రంగంలోకి దిగాలనుకున్నాడు ధనరాజు.

"ఏవంటున్నారండీ ? అప్రతిష్ట ? ఆ పదం ఒకటి ఉందని, మీకు ఇప్పుడు గుర్తు వచ్చిందాండీ ప్రభావతి గారూ. సరిగ్గా ఇప్పటికి పదిహేనురోజుల క్రితం అక్కయ్యపాలెంలోని మీ అబ్బాయి కనకరాజుకు నిశ్చయమైన సంబంధాన్ని మీరు ఎట్లా తప్పించుకున్నారో ఇప్పుడు గుర్తు చేసుకోండి. అదికూడా నిశ్చయ తాంబూళాలు మార్చుకున్న తరువాతే కదా. అప్పుడా ఆ అమ్మాయి తల్లిదండ్రులకు అది అప్రతిష్ట కాదా ? నిశ్చితమైన సంబంధం తప్పిపోయినందుకు వాళ్ళెంతగా ఆవేదనతో కుమిలి పోయారో మీరు ఆలోచించారా ? వాళ్ళు తమ కూతురుకు సంబంధం కుదిరిందని, ఆ కాలనీ వాళ్ళకి, బంధువులకు చెప్పేశారే. మీరు కోరిన వన్నీ ఇస్తామన్నారు. అయినా సరే, అత్యాసకుపోయి, మర్నాడు వెళ్ళి లాంఛనాల కోసం అదనంగా పాతిక వేలు కోరారు. వాళ్ళు ఇవ్వలేమన్నారని సంబంధాన్నే తప్పించేశారు. అది అన్యాయమనిపించడంలేదా మీకు ? నేనిప్పుడు మాట్లాడుతున్నట్లు, మీ అబ్బాయి ఆరోజు పల్లెత్తిమాట అనలేదు. చదువుకొని, ఉద్యోగం చేస్తున్నాడన్న మాటే గాని అతనికి కనీసం కర్తవ్యం గుర్తుకు రాలేదా? మీ చేతిలో అతను ఎంతగా ఓ కీలుబొమ్మలా తయారయ్యాడో తెలుస్తుంది" అంటూ కనకరాజుకేసి చూసి "ఏమండీ కనకరాజుగారు, నేను అన్నదాంట్లో అబద్ధం ఏవీ లేదు కదాండీ. మీ లాంటి వ్యక్తిత్వం లేని కొడుకులుండబట్టే ఈ నాడు సమాజంలో మీ అమ్మలాంటివారి ఆటలు సాగుతున్నాయి.'' అంటూ తల్లీకొడుకులను ఉతికి ఆరేసాడు ధనరాజు.

ప్రభావతి మొహం ఆవేశంతో ఎర్రబారింది. ఆనాటి సంఘటన గుర్తొచ్చింది. అయినా, తనను ప్రశ్నించేవాళ్లు వీళ్ళెవరూ ?... అని మనసులో అనుకుంది.

కనకరాజుకు, మత్తువదిలినట్టయింది. తన చేతకాని తనాన్ని, ధనరాజు ఎత్తిచూపినట్లు గ్రహించాడు. తల్లికేసి తీక్షణంగా చూశాడు.

ముద్దంశెట్టి హనుమంతరావు కథలు

"చెప్పమ్మా ! ఇప్పుడేం సమాధానం చెపుతావో చెప్పు,. నన్ను ఓ చవటని చేసి వ్యక్తిత్వం లేనివాడిగా తయారు చేసి ఇన్నాళ్ళు నీ చేతిలో నన్ను కీలుబొమ్మగా ఆడిస్తూ వచ్చావు. ఆ రోజు నన్ను మాట్లాడనివ్వలేదు. చినబావ, అది అన్యాయం అన్నాడని అతనిపై విరుచుకుపడ్డావు. ఈ రోజు అదే సమస్య నీకు ఎదురయ్యే సరికి, అన్యాయమంటున్నావు, ఆనాడు నీ దృష్టిలో లేని అన్యాయం ఇప్పుడొచ్చిందా అమ్మా ?" ఉక్రోషంతో అన్నాడు కనకరాజు. అతని కళ్ళల్లో ఎర్రటి చారలు దోబూచులాడుతున్నాయి.

ప్రభావతి నిర్ఘాంతపోయింది . ఆశ్చర్యంతో, ఆవేశంతో, కళ్ళింతలు చేసుకొని కొడుక్కేసి చూసింది. ఏనాడు పల్లెత్తుమాట అనని కొడుకు, ఈ రోజు ఎదురు తిరగడం ఆమె సహించలేకపోయింది. ఆమె మొహం జేవురించింది.

"ఒరేయ్ రాజూ, ఒళ్ళు దగ్గరపెట్టుకొనే మాట్లాడుతున్నావా ? " గర్జించింది ప్రభావతి.

కనకరాజు, ఇంతకుమునుపులా భయపళ్ళేదు. గంభీరంగా మొఖం పెట్టాడు.

"ఔనమ్మా ! ఇన్నాళ్ళకు నన్ను నేను తెలుసుకొని, వళ్ళు దగ్గరపెట్టుకొని మాట్లాడుతున్నాను. ఇన్నాళ్ళూ నీ పట్ల గల గౌరవభావంతో నీ పెద్దరికాన్ని నిలిపాను. నీ అహాన్ని, నీ నోటి దురుసుని, ఓర్పుతో సహించాను. అయితే నువ్వు, నీకిచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకోలేకపోయావు. ఇకమీదట, అటువంటి అవకాశాన్ని నీకివ్వడం శ్రేయస్కారం కాదనిపిస్తోంది. ఈ రోజు నుంచీ నేను స్వతంత్ర్యంగా వ్యవహరిస్తాను. నా వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటాను. " గంభీరంగా అన్నాడు కనకరాజు.

ప్రభావతికి, అంతా అయోమయంగా తోచింది. తనకాళ్ళ క్రింద భూమి మెలమెల్లగా జారిపోతున్నట్టనిపించింది.

ధనరాజు, రవి చిరుదరహాసాలతో చప్పట్లు కొట్టారు.

"భేష్ కనకరాజుగారూ ! ఇప్పుడు మీరు వెన్నెముకగల మనిషి అనిపించుకున్నారండీ. కాని ఒక అవివాహిత అమ్మాయికి జరగాల్సిన అన్యాయం ఎప్పుడో జరిగిపోయిందండీ. ఆ రోజే మీలో ఇటువంటి మార్పు వచ్చినట్టయితే ఎంతో బాగుండేది" అన్నాడు రవి.

కనకరాజు, బరువుగా ఓ నిశ్వాసం వదిలాడు.

"నిజమే రవిగారూ ! నా తప్పుకి నిష్కృతి లేదు. అదంతా తల్చుకుంటే తలవంచుకోవల్సిందనిపిస్తోందండి. నిజంగా సిగ్గుపడుతున్నాను ఆడపెత్తనాలు, ఒకొక్కప్పుడు ఎటువంటి అనర్థాలు

సృష్టిస్తాయో, ఇప్పుడు అర్థం చేసుకున్నాను. నేను చేసిన తప్పును సరిదిద్దుకుంటానండీ. మా అమ్మ తప్పించిన ఆ సంబంధాన్నే నేనంగీకరిస్తున్నాను. నేనే స్వయంగా వెళ్ళి వాళ్ళతో చెబుతాను ఈ విషయంలో నాకు సహకరించండి సార్ !" అన్నాడు కనకరాజు.

ప్రభావతి, ఉక్రోషంతో ఊగిసలాడింది. కొడుకు మాటలను ఆమె హర్షించలేదు సరికదా అసహ్యించుకుంది.

" నోర్మూయ్ చవట వెధవ ! మళ్ళీ ఏ మొహం పెట్టుకొని వాళ్ళింటికి వెళతావు? సిగ్గులేదూ ?" కోపంగా అంది ప్రభావతి.

కనకరాజు బెదిరిపోలేదు. మునుపటి కనకరాజు కాదుకదా !

" సిగ్గుపడాల్సింది నేను కాదమ్మా ! నువ్వు ! నువ్వు చేసిన ఆ ఘనకార్యానికి మొహం దించుకోవాల్సింది నువ్వు. నాకెందుకమ్మా సిగ్గు ? వాళ్ళింటికి వెళ్ళి, నా తప్పును ధైర్యంగా ఒప్పుకుంటాను. ఆలస్యమే అయినా, నేను చేసిన తప్పును సరిదిద్దుకుంటాను." అన్నాడు కనకరాజు నిష్కర్షగా.

ప్రభావతి మొహం పక్కకు తిప్పుకుంది అవమానభారంతో కృంగిపోయింది. కనకరాజు, ధనరాజుకేసి తిరిగాడు.

" ధనరాజుగారూ, మీరు అడుగుతున్న ముప్పయివేలు అదనంగా ఇస్తాను. మా చెల్లిల్ని వివాహం చేసుకోవడానికి, మీకేమీ అభ్యంతరం లేదు కదా ?" అన్నాడు సౌమ్యంగా.

ధనరాజు, మెల్లగా నవ్వాడు.

" ఇదంతా మీకు కనువిప్పు కలిగించడానికి మేము ఆడిన నాటకమండీ కనకరాజుగారూ ! 15 రోజుల క్రితం, మీకు నిశ్చయమైన సంబంధాన్ని మీ అమ్మగారు ఇదే పద్ధతిలో తప్పించేశారు గుర్తుందా? వాళ్ళు మాకు దగ్గర బంధువులండి ! మీరు మీ తప్పును తెలుసుకొని సరిదిద్దుకోవాలని నిశ్చయించుకున్నారు కాబట్టి, ఈ నాటకానికి తెర దించేస్తున్నాను. నాకు అదనంగా 30వేలు అవసరం లేదండీ. మా బంధువులమ్మాయిని మొదట్లో నిశ్చయమైన ప్రకారం వివాహం చేసుకుంటున్నారు కదా." అన్నాడు ధనరాజు.

కనకరాజు ఆనందంతో ఉప్పొంగిపోయాడు. అతని మొహం వికసించింది.

" ఆ విషయంలో మీకు సందేహం వద్దండీ. ఇప్పుడు, మారిన మనిషిని. నాకు వ్యక్తిత్వం

ఉందని నిరూపించుకుంటాను. మన రెండు వివాహాలు ఒకేసారి జరిపించుదాం. ఈ రోజే, మీతో పాటు మీ బంధువుల ఇంటికి వెళ్ళి, వాళ్ళకు క్షమాపణలు చెప్పుకుంటాను.'' ఉత్సాహంగా అన్నాడు కనకరాజు.

రవి, ధనరాజు పరస్పరం మొహాలు చూసుకొని నవ్వుకున్నారు. కనకరాజు నిర్ణయం వాళ్ళకు ఎంతో ఆనందం కలిగించింది.

ప్రభావతి మాత్రం ఆనందించలేదు. తన చేతుల్లోనించి జారిపోతున్న కొడుకుని, చేతుల్లోనే బంధించాలని మరోసారి ప్రయత్నం చేసింది.

" నువ్వు, వాళ్ళింటికి వెళ్ళడానికి వీళ్ళేదురా రాజు ! ఇది, నా నిర్ణయం. నీ చెల్లిలికి ఈ సంబంధం తప్పిపోయినా భాదపడను, కాని, నేను తప్పించిన ఈ సంబంధాన్ని నువ్వు చేసుకోవడానికి వీల్లేదు. అలా జరిగితే నా శవాన్ని కళ్ళజూస్తావు'' కోపంతో అంది ప్రభావతి.

కనకరాజు కాస్తంతైనా చలించలేదు. అతనికి తెలుసు తల్లికి ప్రాణం అంటే ఎంత తీపో !

" అమ్మా నేనో మంచి పని చేస్తున్నాను నువ్వు సంతోషించాలి. ఆ సంబంధం నేను చేసుకుంటే చస్తానని బెదిరిస్తున్నావు ఆయుష్షు నిండితే, ఎవరి ప్రాణాలైనా అనంత విశ్వంలో కలుస్తాయి. దానికి ఎవ్వరమూ ఏమీ చేయలేము. అనవసరంగా నువ్వు ఆవేశపడకు. కనీసం చెల్లాయి వివాహం జరుగుతున్నందుకు ఆనందించు. ఇప్పుడే వాళ్ళింటికి వెళ్ళి చెప్పివస్తాను. పదండి ధనరాజు...'' అన్నాడు రవి.

రవి, ధనరాజు లేచి నిలుచున్నారు.

" కనకరాజుగారూ ఈ రోజు మీలోని ఈ పరివర్తన చూస్తుంటే మాకు ఎంతో ఆనందంగా ఉంది. పదండి వెళ్దాం '' అన్నాడు రవి.

కనకరాజు బయలుదేరుతూ తల్లితో అన్నాడు.

" అమ్మా, నువ్వు ఏర్పాటుచేసిన విందుకు కాసేపట్లో అందరూ వస్తారు మరేం బాధపడకు'' అంటూ ముందుకు సాగిపోయాడు. అతని వెంట ధనరాజు, రవి బయటకు నడిచారు.

ప్రభావతికి, తలకొట్టేసినంత పనైంది. నిశ్చలంగా ఓ శిలా ప్రతిమలా, వెళ్తున్న కొడుక్కేసి చూస్తూ ఉండిపోయింది. తన పట్టులోంచి కొడుకు జారిపోయాడు అనుకుంది లోలోన ఎంతో భాదగా.

□□□

(మయూరి వారపత్రిక -23.5.97)